
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....


# వన్ నేషన్


RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 337 ఎడిటర్: కె.యువరాజ్ బుధవారం 16-9-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు





- ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం - ఆగాఖాన్ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలపై ప్రశంసలు - సిటీ కాలేజీ, ఉస్మానియా ఆస్పత్రిని పునరుద్ధరించాలని వినతి - ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5కు సీఎం రేవంత్ ఆహ్వానం.. ఆగాఖాన్ ఫౌండేషన్ కార్యక్రమాలపై ప్రశంసలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (వన్‌నేషన్):** భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7 నుంచి నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని విద్య, వైద్య, పర్యాటక రంగాల్లో కలిసి పనిచేద్దామని ప్రతిపాదించారు. మంగళవారం తాజ్ ఫలక్‌నుమా ప్యాలట?సలో ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5 తండ్రి ఆగాఖాన్-4 మృతి పట్ల సీఎం సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగాఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగాఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ

3లో

# మార్చికి 5.52 లక్షల ఇళ్లు పూర్తి

- సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి: సీఎం చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబర్ 15 (వన్‌నేషన్):** వచ్చే ఏడాది మార్చి నాటికి రాష్ట్రంలో 5.52 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్, పీఎం జన్‌మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ 1.5 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి 2.05 లక్షల ఇళు ,, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. గృహనిర్మాణ శాఖపై మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్షించారు.

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. 2027 డిసెంబరు నాటికి 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా చూడటంతోపాటు 1.5లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లోకి తీసుకురావాలని సూచించారు. ఆర్టీజీఎస్ సహా ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల నుంచి డేటాను అనుసంధానం చేసుకుని, డూప్లికేషన్ లేకుండా అర్హులను గుర్తించాలని దిశానిర్దేశం చేశారు. కుప్పం నియోజకవర్గంలోనూ పూర్తిస్థాయిలో గృహ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర సహకారంతో వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక టౌన్‌షిపలను నిర్మించే అంశంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. శ్రీసిటీ సహా వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిపల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని వీటి నిర్మాణాన్ని చేపట్టాలన్నారు.

# ఆ బస్సులకు నోఎంట్రీ!

- ఆర్టీసీ, ప్రైవేటు సహా అన్ని అంతర్రాష్ట్ర బస్సులు హైదరాబాద్ శివారు వరకే.. - గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్‌కేసర్‌లో బస్ టెర్మినల్స్ - మెట్రో, ఎంఎంటీఎస్, సిటీ బస్సులతో అనుసంధానం: మంత్రి పొన్నం



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (వన్ నేషన్):** హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌కు నలువైపులా గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు ప్రతిపాదనలపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి హైదరాబాద్‌లోకి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగరంలోకి రానీయకుండా ఆయా మార్గాల్లో ఏర్పాటు చేసే టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి పొన్నం మంగళవారం వెల్లడించారు. శంషాబాద్ విమానాశ్రయం వైపు వెళ్లే బస్సులు, హైదరాబాద్‌కు వచ్చే అంతర్‌జిల్లా బస్సులు కూడా అవసరాన్ని బట్టి నిర్దేశిత టెర్మినల్స్ వద్ద నుంచే రాకపోకలు సాగించేలా ప్రణాళికలు చేస్తున్నామని చెప్పారు. ఆయా టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేందుకు సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేయాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ బస్సుల వల్ల ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా ప్రైవేట్ బస్సులు కూడా నిర్దేశిత బస్ టెర్మినల్స్ నుంచి రాకపోకలు కొనసాగించడంపై ప్రభుత్వం కార్యాచరణ

3లో




- స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు - మాడవీధుల్లో పెద్దశేషుడిపై మలయప్ప చిద్విలాసం - నేడు చిన్నశేష, హంస వాహన సేవలు

**తిరుమల, సెప్టెంబర్ 15 (వన్ నేషన్):** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం 6.21- 6.35 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద ఘోష మధ్య మంగళవాయిద్యాలు మోగుతుండగా బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన అర్చక బృందం.. సకల దేవతామూర్తులు, అష్టదిక్పాలకులకు ఆహ్వానం పలికింది. దీంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప స్వామి పెద్దశేష వాహనంలో నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తకోటిని కటాక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు 15వ సారి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్ దంపతులతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుమలలోని గాయత్రి విశ్రాంతి భవనానికి చేరుకుని కొంతసమయం విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం సంప్రదాయ వస్త్రధారణతో తొలుత బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ అర్చకులు చంద్రబాబు తలకు పరివట్టం చుట్టి శేషవస్త్రాన్ని మెడలో ధరింపజేశారు. ఆ తర్వాత నూతన పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ

3లో


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో
కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై
అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల
వ్యాప్తంగా జిల్లాలు, మండలాల
వారీగా పనిచేసే విలేకరులు
కావలెను.

9948222240

# మానవుడా! --- అర్ధశతాబ్దం దాటినా ఆరని మానవతా స్వరం...



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (వన్‌నేషన్):** ప్రకృతికి సూర్యుడు ఎంత సహజమైన పరిచయమో, తెలుగు సాహిత్య ప్రపంచానికి డా. నలిమెల భాస్కర్ అంతటి సుపరిచితమైన పేరు. ఆయనను కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. అయితే ఒక మహావృక్షాన్ని అర్థం చేసుకోవాలంటే దాని తొలి మొలకను చూడాలి ఒక విశాల ప్రవాహం స్వభావాన్ని తెలుసుకోవాలంటే దాని పుట్టుకవైపు నడవాలి. ఆ దృష్టితో చూస్తే, 1974లో డిగ్రీ విద్యార్థిగా ఉన్న నలిమెల భాస్కర్ రచించిన తొలి గేయ సంపుటి 'మానవుడా!' ఆయన అనంతర సాహిత్య ప్రయాణానికి మూలబీజం.

నేను పుట్టకముందే వెలువడిన ఈ పుస్తకాన్ని నేడు చదువుతుంటే, కాలం వెనక్కి నడిచి ఒక యువకవి హృదయస్పందనను మన ముందుంచిన ట్లనిపిస్తుంది. కామారెడ్డి ప్రభుత్వ కళాశాల ప్రచురించిన ఈ తొలి కృతిని భాస్కర్ అదే కళాశాలకు అంకితం చేయడం ఆయనలోని కృతజ్ఞతా సంస్కారానికి నిదర్శనం. ఐదు దశాబ్దాలకు పైగా గడిచిన అనంతరం 2026లో సాహితీ సోపతి, కరీంనగర్ ద్వితీయ ముద్రణగా దీనిని మళ్లీ పాఠకుల ముందుకు తీసుకురావడం ఒక పాత పుస్తకాన్ని పునర్ముద్రించడం మాత్రమే కాదు తెలుగు సాహిత్య చరిత్రలోని ఒక తొలి అక్షరాన్ని కొత్త తరానికి పరిచయం చేయడం. మొత్తం పదహారు గేయాలతో కూడిన ఈ చిన్న సంపుటిలో దేశభక్తి, మానవత, సామాజిక చైతన్యం, అభ్యుదయం, ప్రకృతి, ఆవేదన, ఆత్మపరిశీలన వంటి అనేక భావధారలు కలిసిపోతాయి. అధిక భాగం మాత్రాఛందస్సులో సాగుతూ, గేయానికి అవసరమైన లయ, సౌలభ్యం, శ్రావ్యతను పొందాయి. ప్రాసలు బలవంతంగా పెట్టినట్లు కాక భావానికి సహజంగా అతుక్కొని రావడం, ఎక్కడ భాష మృదువవ్వాలో, ఎక్కడ పదునెక్కాలో యువకవికి అప్పుడే తెలిసి ఉండటం విశేషం.

# అంబర్ పేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**అంబర్ పేట్, సెప్టెంబర్ 15 (వన్ నేషన్) :** అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. శివం రోడ్డు లోని న్యూ ఆజాం కాంప్లెక్స్ లో గల సంఘం కార్యాలయంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి మర్రి హరి, ప్రధాన కార్యదర్శి చిలక శివ్ కుమార్, ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, పెద్ద బొమ్మ మధుసూదన్, అంజాల విజయ్ కుమార్, ఏ వి రాజశేఖర్, కార్యదర్శులు తీగల నరేందర్, గంగిశెట్టి మల్లేష్, రాజేందర్ నాగుల, సలహాదారులు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, చిలువేరు యాదగిరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు భోగ నీరజ, డివిజన్ల అధ్యక్షులు గంగిశెట్టి సత్తయ్య, పెద్ద బొమ్మ దామోదర్, కోట వెంకటేష్ ఎస్ నర్సింగ్ రావు, సాయిని మూర్తి, కైరం కొండ శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి వనం రమణ తదితరులు పూజలో పాల్గొన్నారు.

# బాలాపూర్ గణేశుని దర్శించుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



**బాలాపూర్, సెప్టెంబర్ 15 (వన్ నేషన్) :** జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రపంచ ప్రసిద్ధ బాలాపూర్ గణేష్ ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల మొదటి పూజ మహోత్సవం సందర్భంగా మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి బాలాపూర్ విఘ్నేశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు పారిజాత నర్సింహారెడ్డి దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమం అనంతరం పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ... విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన బాలాపూర్ గణేష్ ఉత్సవాల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. భక్తులందరూ వినాయక చవితి పండుగను ప్రశాంతమైన, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్' ప్రారంభం

**- బ్రాండ్ అంబాసిడర్లుగా హర్భజన్ సింగ్, సురేష్ రైనా - 32 జట్లు, 127 మ్యాచ్‌లు..**



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (వన్‌నేషన్):** భారత సాఫ్ట్‌బాల్ క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి చేర్చే లక్ష్యంతో 'ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్' రెండో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి సీజన్‌తో పోలిస్తే దాదాపు మూడు రెట్ల విస్తృతితో దేశవ్యాప్తంగా 32 జట్లు, 127 మ్యాచ్‌ల భారీ షెడ్యూల్‌ను లీగ్ నిర్వాహకులు ప్రకటించారు. ప్రముఖ క్రికెట్ దిగ్గజాలు హర్భజన్ సింగ్, సురేష్ రైనా బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వీక్షకులకు చేర్చేందుకు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, స్క్రీనాక్స్, మైఆసియా వంటి సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ రాజు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం సాఫ్ట్‌బాల్ క్రికెట్‌ను ప్రజలు గుర్తించేలా చేయడానికి ప్రయత్నించేవాళ్లమన్నారు. ఇప్పుడు మా వద్ద 32 జట్లు ఉన్నాయన్నారు. చాలా జట్లలో చిన్న చిన్న పట్టణాల నుంచి ఆటగాళ్లు వచ్చారన్నారు. సీజన్ 2 ప్రత్యేకత ఇదేనన్నారు. ఈ సందర్భంగా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ మాట్లాడుతూ లీగ్ ఎంత పెద్దదైతే అంత ఎక్కువ మంది యువ ఆటగాళ్లకు గుర్తింపు దక్కే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సోనీ స్పోర్ట్స్ ఏవీపీ కౌశిక్ కల్లూరి మాట్లాడుతూ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో కేవలం ఒక ఆటను టెలివిజన్‌లో ప్రసారం చేయడమే కాదన్నారు. ఈ ఆటకు ఒక ప్రత్యేకమైన నేపథ్యం ఉందన్నారు. ఎందుకంటే, ఇది అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన ఆటగాళ్లకు పెద్ద వేదికపై తమ ప్రతిభను చాటుకునే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. సీజన్ 2 ఇంత భారీ స్థాయిలో విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రయాణంలో భాగస్వాములు కావడం, ఈ క్రీడను మరింత విస్తృతమైన ప్రేక్షకులకు చేర్చడంలో సహాయపడటం మాకెంతో ఉత్సాహాన్నిస్తోందని తెలిపారు. మా అనుబంధం ఆటగాళ్లకు, జట్లకు క్రీడకు మరింత గుర్తింపును తెస్తుందని, దేశవ్యాప్తంగా మరింత మంది యువ క్రికెటర్లు ఈ క్రీడలో తమకూ ఒక స్థానం ఉందనే నమ్మకాన్ని కలిగించేలా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైఆసియా ప్రతినిధి నూరుల్ అమీన్ మాట్లాడుతూ ఇది కేవలం ఒక్క సీజన్‌కు మాత్రమే పరిమితమైన స్పాన్సర్‌షిప్ కాదన్నారు. భారతదేశంలో సాఫ్ట్‌బాల్ క్రికెట్ వృద్ధిపై పెట్టిన దీర్ఘకాలిక పెట్టుబడి అని స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ టెలివిజన్ ప్రేక్షకులకు అందించేందుకు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ అధికారిక ప్రసార భాగస్వామిగా ఉంది. దేశవ్యాప్తంగా 1500 పైగా స్క్రీన్లలో ఈ మ్యాచ్‌లను ప్రదర్శించడానికి స్క్రీనాక్స్ అధికారిక స్క్రీనింగ్ భాగస్వామిగా వ్యవహరించ నుంది. ఇక అంతర్జాతీయ లీగ్‌గా విస్తరించడంతో పాటు వాణిజ్యపరంగా క్రీడా ప్రాపర్టీగా తీర్చిదిద్దే బాధ్యతతో మైఆసియా వ్యూహాత్మక భాగస్వామిగా జతకట్టింది. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి, ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ బీహెచ్ అనిల్ కుమార్, వైస్ చైర్మన్ సంజీవ్ సింగ్ పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో...రెండో దఫా అక్రిడేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారు?

**- రెండు నెలలుగా ఎదురుచూస్తున్న ఖమ్మం జిల్లా జర్నలిస్టులు - మొదటి దశలో 800 మందికి కార్డులు.. రెండో దశ కోసం సుమారు 400 మంది నిరీక్షణ - ఉపముఖ్యమంత్రి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఇలాకాలోనే - అక్రిడేషన్ కార్డుల కోసం ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులు - సీనియర్ పాత్రికేయులు- కందుకూరి యాదగిరి 9640282050**

**ఖమ్మం, సెప్టెంబర్ 15 (వన్ నేషన్) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గార్ల ఇలాకా లోనే జర్నలిస్టులు అక్రిడేషన్ కార్డుల కోసం ఇబ్బందులు పడుతున్నారు గత రెండు నెలలుగా రెండవ దఫా కార్డులు ఎప్పుడు జారీ చేస్తారని సుమారు 400 మంది కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మొదటి దశలో సుమారు 800 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినప్పటికీ అన్ని అర్హతలు ఉండి రెండవ దఫా అక్రిడేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్న 400 మంది జర్నలిస్టులు ఇంకా ఉన్నారు. రెండో దశ అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు తమ కార్డులు ఎప్పుడు వస్తాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అనేక రోజులు గడిచినా ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవ డంతో జర్నలిస్టుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ, డీపీఆర్వో కార్యాలయం మధ్య సమన్వయం లేకపోవడం వల్లే జాప్యం జరుగుతోందా? అనే ప్రశ్నలు జర్నలిస్టుల్లో వ్యక్తమవుతున్నాయి. కమిటీ సమావేశానికి సమయం కుదరడం లేదా? అధికారుల స్థాయిలో నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందా? అనే విషయాలు స్పష్టంగా తెలియక జర్నలిస్టులు అయోమయానికి గురవుతున్నారు.



**తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక**

రెండవ దఫా అక్రిడేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులు మాత్రం తమ సమస్యను ఎవరిని సంప్రదించాలో, ఎప్పుడు పరిష్కారం లభిస్తుందో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి అక్రిడిటేషన్ ప్రక్రియపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని వారు కోరుతున్నారు. అధికారుల నుంచి స్పష్టత కావాలి జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి వృత్తిపరమైన గుర్తింపుకు సంబంధించిన కార్డుల జారీ ప్రక్రియలో సాక్షాత్తు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఇద్దరు ఉద్దండులు ఉన్న ఇలాకాలోనే జర్నలిస్టులకు ఇలా ఇబ్బందులు జరిగితే మిగతా జిల్లాల వారి పరిస్థితి ఏమిటి అని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రెండవ అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించాలని రెండవ దఫా అక్రిడేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులు కోరుతు న్నారు. లేనిపక్షంలో ఈ విషయం ఉపముఖ్యమంత్రి దృష్టికి సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

# వర్షాభావంతో ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం నిద్రపోతుందా?



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 15 MD యూసుఫ్ (వన్ నేషన్) : పేదల కడుపు కొట్టే పాలనను తిప్పికొడతాం రేషన్ షాపుల ద్వారా ఉచిత నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి. ఎమ్మిగనూరు: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ తీవ్రంగా విమర్శించింది. ప్రజల కష్టాలను గాలికి వదిలేసిన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్షాలు లేక రైతులు పంటలు పండక తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారని, కూలీలు, పేదలు ఉపాధి కోల్పోయి కుటుంబాలను పోషించుకోలేని దుస్థితిలో ఉన్నారని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ప్రజల ఆకలి బాధలను పట్టించుకోని పాలకులకు అధికారం, ఆర్భాటాలే తప్ప ప్రజా సంక్షేమం పట్టడం లేదని విమర్శించారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

తక్షణమే అమలు చేయాల్సిన డిమాండ్లు- రేషన్ షాపుల ద్వారా ప్రతి కుటుంబానికి 50 కేజీల బియ్యం, 5 కేజీల కందిపప్పు, చింతపండు, చక్కెర, గోధుమలు, జొన్నలు, 5 లీటర్ల వంట నూనె తదితర నిత్యావసర సరుకులను ఉచితంగా అందించాలి. ఎమ్మిగనూరు పట్టణంలోని రైతు బజార్‌లో నిత్యావసర వస్తువులను సబ్సిడీ ధరలకు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. వర్షాభావంతో నష్టపోయిన రైతులను, ఉపాధి కోల్పోయిన కూలీలను తక్షణమే ఆదుకోవాలి. పేద ప్రజలపై ధరల భారాన్ని తగ్గించి, ఆహార భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి. ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రజల హక్కుల కోసం, పేదల ఆహార భద్రత కోసం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిరంతరం పోరాడు తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. సత్యన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం. మల్లికార్జున, పీవైఎల్ జిల్లా నాయకులు ఎస్. మునెప్ప, ఏఐకెఎంఎస్ నాయకులు పెద్దారెడ్డి, నాగరాజు, మహేష్, వీరాంజనేయులు, నరసింహులు, దేవా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఇన్వెస్ట్ తెలంగాణ' సదస్సుకు రండి

(1వ పేజీ తరువాయి)

వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగాఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా ఆగాఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు.

### మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి

మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈసీ, మూసీ నదుల సంగమ ప్రదేశం ఆక్రమణలకు గురికావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీ నదిని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణలో ఆగాఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పగా.. దీనిపై ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. కాగా, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా ప్రస్తుతం 2.5 శాతం ఉందని, దానిని 10శాతానికి పెంచుతామని అన్నారు. ఇందులో భాగంగా డిసెంబరు 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ఆ బస్సులకు నోఎంట్రీ!

(1వ పేజీ తరువాయి)

రూపొందిస్తుందన్నారు. నిబంధనల మేరకు యూజర్ చార్జీలు చెల్లించి ప్రైవేటు ఆపరేటర్లు టెర్మినల్స్‌ను వినియోగించుకునే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేటు, ఆర్టీసీ దూరప్రాంత బస్సులు టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధానం అమల్లోకి వస్తే.. హైదరాబాద్ ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు అవసరమైన భూమి విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని పొన్నం తెలిపారు. గాజులరామారంలో సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ వైపు సుమారు 150 ఎకరాల భూమిని బస్ టెర్మినల్ అవసరాలకు కేటాయించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. కాగా, మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటింటా కుట్టుమిషన్ల పథకం దరఖాస్తుల గడువును పొడిగించారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం

(1వ పేజీ తరువాయి)

ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని వస్త్రసమర్పణ చేశారు. అనంతరం టీటీడీ ముద్రించిన 2027 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సీఎం ఆవిష్కరించారు. అక్కడినుంచి వాహన మండపానికి చేరుకుని పెద్దశేష వాహన సేవలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

### నేడు ప్రారంభోత్సవాలు

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు బుధవారం ప్రారంభిస్తారు. తిరుమలకు వచ్చే భక్తులందరికీ బీమా కల్పించేలా ఎల్ఐసీ సంస్థతో ఎంవోయూ చేసుకుని, 'సందకం' యాప్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత ముఖేశ్, అనంత్ అంబానీ విరాళంగా ఇచ్చిన 25 ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియంను ప్రారంభిస్తారు.

దేశంలో, ప్రపంచంలో ఉండే హిందువులంతా ఒక్కసారైనా తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకోవాలని, ఆయన సాన్నిధ్యంలో కొంత సమయం గడపాలని ఆశిస్తారని చంద్రబాబు అన్నారు. భక్తులందరికీ ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించే విధంగా పాలకమండలి, టీటీడీ సిబ్బంది పనిచేయాలని కోరారు. ముఖ్యమంత్రిగా 15వ సారి వచ్చి ప్రభుత్వం తరపున లాంఛనాలు సమర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు పడాలని, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ముందుండి నడిపించేలా ఆశీర్వదించాలని శ్రీవారిని కోరుకున్నానని సీఎం తెలిపారు.

# శెట్టిబలిజల దార్శనీకుడు "చంద్రన్న"



ఎక్కడ అవమానించబడ్డారో అక్కడే గౌరవం పొందడం" అనేది జీవితంలో అత్యంత గొప్ప విజయంగా అభివర్ణించవచ్చు. ఒక సామాజిక వర్గాన్ని తక్కువ చేసి మాట్లాడడం, అవమానించిన వ్యక్తుల ముందే మన ప్రతిభతో, కష్టపడే తత్వంతో ఉన్నత స్థానానికి ఎదగడం సామాన్యమైన విషయం కాదు. ఒక జాతిని అవమానించిన వారిపై గొడవపడటం లేదా కక్ష సాధించడం కంటే, మన ఎదుగుదల ద్వారా వారికి సమాధానం చెప్పడమే అత్యుత్తమ ప్రతీకారమని చెప్పాలి. అవమానాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, వాటినే పెట్టుబడిగా మార్చుకుని కష్టపడితే ఒకరోజు ఖచ్చితంగా అదే స్థానంలో మనకు గౌరవం దక్కుతుంది.

ఈ సూత్రం రాష్ట్రంలోని శెట్టి బలిజ సామాజిక వర్గానికి వర్తిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వ విధ్వంసక పాలనలో శెట్టి బలిజలకు అడుగడుగునా అవమానాలే. అయినా గాని ఆసవాళ్లను ఎదుర్కొని పైకి వచ్చి తమ ఆత్మాభిమానానికి ఎక్కడ భంగం కలగ కుండా నిలబడిన జాతి శెట్టి బలిజలు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శెట్టి బలిజల జీవితాల్లో కొత్త వెలుగులు ఆరంభమయ్యాయి. రాజకీయంగా కూడా శెట్టి బలిజలకు అగ్ర తాంబూలం దక్కింది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన కొన్ని మెమోలు, ఉత్తర్వుల వల్ల శెట్టి బలిజల ప్రత్యేక అస్తిత్వానికి భంగం కలిగింది. కొన్ని ఉప-కులాలతో క్లబ్ చేయడం వల్ల తమ సామాజిక వర్గానికి రిజర్వేషన్ల పరంగా నష్టం వాటిల్లింది. అంతేకాదు గత శాసనసభ లోక్ సభ ఎన్నికల్లో శెట్టి బలిజలకు టిక్కెట్లు కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చామని చెప్పుకునే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ సామాజిక వర్గం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. టిక్కెట్లు ముఖ్యం కాదు సంక్షేమం కావాలని శెట్టి బలిజలు గగ్గోలు పెట్టిన నాటి ప్రభుత్వం పెడ చెవిన పెట్టింది. అందుకే శెట్టిబలిజలు వైసీపీ ప్రభుత్వానికి కర్ర కాల్చి వాత పెట్టారు.

కోస్తా ఆంధ్ర ప్రాంతంలో, ముఖ్యంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో శెట్టి బలిజలు రాజకీయంగా అత్యంత బలమైన వర్గం. ఎన్నికల టికెట్ల కేటాయింపులు, స్థానిక సంస్థల పదవుల విషయంలో తమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. అందుకే శెట్టి బలిజలంతా ఐక్యమై వైసీపీకి ఓటమికి కంకణం కట్టుకుని కూటమికి మద్దతు పలికారు. శెట్టి బలిజల సత్తా ఏమిటో నిరూపించారు. వైసీపీ అయిదేళ్లపాలనలో అణగదొక్కబడిన శెట్టి బలిజలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాళ్ళ ఆత్మాభిమానాన్ని గౌరవించింది.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శెట్టిబలిజ (గౌడ, ఈడిగ) సామాజికవర్గానికి రాజకీయంగా, ఆర్థికంగా తగిన ప్రాధాన్యత కల్పించారు. గత ప్రభుత్వ కాలంలో నిర్వీర్యమైన శెట్టిబలిజ సంక్షేమ కార్పొరేషన్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరించి, బలోపేతం చేసింది. ఈ కులాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, చైర్మన్, డైరెక్టర్ల ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోంది.

గీత వృత్తిని నమ్ముకున్న శెట్టిబలిజ, గౌడ కులాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా కూటమి ప్రభుత్వం తన నూతన లిక్కర్ పాలసీలో 10 శాతం దుకాణాలను గీత కులాల వారికి కేటాయించేలా నిర్ణయాలు తీసుకుంది.

శెట్టిబలిజల గుర్తింపునకు సంబంధించి గతంలో వచ్చిన వివాదాస్పద జీవోలపై స్పందిస్తూ, శెట్టిబలిజలకు "శెట్టిబలిజ" పేరుతోనే కుల ధృవీకరణ పత్రాలు అందేలా ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసి ఆ సామాజిక వర్గం ఆత్మాభిమానాన్ని చంద్రన్న ప్రభుత్వం నిలబెట్టింది. గత ప్రభుత్వం శెట్టి బలిజ(గౌడ) అనే పేరుతో కులధృవీకరణ పత్రాలను జారీ చేసే విధంగా జీవోను తెచ్చి శెట్టిబలిజలను మానసిక క్షోభకు గురిచేసింది. శెట్టి బలిజల ఆవేదనను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి గౌడ అనే పదాన్ని తొలగిస్తూ కేవలం శెట్టి బలిజ అనే పేరుతో ధృవీకరణ పత్రాల జారీకి ప్రత్యేక జీవోను విడుదలచేసి ఆ సామాజికవర్గం ఆత్మగౌరవానికి విలువ నిచ్చారు.

శెట్టిబలిజ సామాజికవర్గానికి ఐక్యత, ఆత్మగౌరవాన్ని అందించిన ప్రతీక శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి గారి జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం రాష్ట్రంలోని శెట్టి బలిజలందరికీ గర్వకారణం.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే దొమ్మేటి వెంకటరెడ్డి గారి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ శెట్టి బలిజలకు హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేసిన లోకేష్ శెట్టి బలిజ కులస్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. అంతేకాకుండా దొమ్మేటి వెంకటరెడ్డి గారి జ్ఞాపకార్థం బొడసకుర్రు బ్రిడ్జికి ఆయన పేరు పెట్టడమే కాక విగ్రహాన్ని కూడ నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. చంద్రన్న పాలనలో గీతకార్మికులకు భీమా సౌకర్యం కల్పించడం జరుగు తోంది.ప్రమాదవశాత్తు తాటిచెట్ల పై నుండి జారిపడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ అయిదు లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించడానికి కూడ ముఖ్యమంత్రి సుముఖత చూపడం ఆ సామాజిక వర్గం పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని తేట తెల్లం చేస్తున్నది.

చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం శెట్టిబలిజ సామాజిక వర్గం అభ్యున్నతి, ఆత్మగౌరవం కోసం, హక్కుల పరిరక్షణ కోసం అనేక చారిత్రాత్మక నిర్ణయాలు అమలు చేస్తోంది. మాటల్లో కాకుండా చేతల్లో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపిస్తోంది. రాష్ట్రంలోని శెట్టిబలిజల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి చంద్రన్న నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది.

వాసంశెట్టి సుభాష్
కార్మికశాఖమంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# మహేష్ కుమార్ గౌడ్ రెండేళ్ల నాయకత్వానికి ఘన అభినందనలు

### - టీపీసీసీ అధ్యక్షుడిగా విజయవంతమైన రెండేళ్ల ప్రస్థానంపై ప్రశంసలు - కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనపై హర్షం.. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని పిలుపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (వన్‌నేషన్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వాన్ని కొనియాడుతూ, ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

రెండేళ్ల కాలంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, నాయకులు--కార్యకర్తలను సమన్వయంతో ముందుకు నడిపించడం, ప్రజా సమస్యలను పార్టీ వేదికగా బలంగా వినిపించడం వంటి అంశాల్లో టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ కీలక పాత్ర పోషించారని నాయకులు పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం ఏర్పడిందని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తిచేసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కూడా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ విభాగం నాయకులు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎస్సీ విభాగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మారపెల్లి కుమార్, జగదీశ్వర్ రావు, నార పోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మహేష్ కుమార్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని వారు అన్నారు.

టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ నార పోగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో ఎస్సీ విభాగం కీలక పాత్ర పోషించాలని అన్నారు. అణగారిన వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

టీపీసీసీ వైస్ చైర్మన్ జగదీశ్వర్ రావు మాట్లాడుతూ.. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని అన్నారు.

కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో జీవన్ జ్యోతి డాక్టర్ డా. సంతోష్ ముదిరాజ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమ ఏర్పాట్లు, నాయకులు--కార్యకర్తల సమన్వయం, కార్యక్రమ నిర్వహణ తదితర అంశాలను సమర్థవంతంగా పర్యవేక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆయన చేసిన కృషిని నాయకులు అభినందించారు.

పార్టీ నాయకత్వం పట్ల పూర్తి నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేస్తూ కవ్వంపల్లి సత్యనారాయణ మార్గదర్శకత్వంలో, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

చివరగా ప్రత్యేకంగా అభినందనలు

టీపీసీసీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గద్దల హైమావతి మహేష్ కుమార్ గౌడ్ రెండేళ్ల విజయవంతమైన నాయకత్వానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పార్టీ కార్యక్రమాల పట్ల అత్యంత చురుకుదనంతో, నిరంతర శ్రమతో పనిచేస్తూ పార్టీ కోసం అంకితభావంతో ముందుకు సాగుతున్న హైమావతి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని నాయకులు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో, నాయకత్వ నిర్ణయాలకు కట్టుబడి ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడాలని, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యాలతో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో ప్రజల మధ్య పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# బాలాపూర్ గణేషుడిని దర్శించుకున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**బాలాపూర్, సెప్టెంబర్ 15 (వన్ నేషన్) :** ప్రసిద్ధ బాలాపూర్ గణనాథుడిని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తన కుటుంబ సభ్యులుతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

అంతకుముందు బాలాపూర్ చేరుకున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి, బాలాపూర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్లెం నిరంజన్ రెడ్డి మరియు ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు ఆయనను తీర్థప్రసాదాలతో శాలువాతో సత్కరించారు.

చిన్ననాటి కల నెరవేరింది: ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ తన ఆనందాన్ని పంచుకున్నారు. "నాకు చిన్ననాటి నుండి బాలాపూర్ గణనాథుడంటే ఎంతో ఇష్టం. ఆ దేవుడి పిలుపు వస్తేనే మనం ఆయన్ను దర్శించుకోగలమని నమ్ముతాను. ఇప్పటికి బాలాపూర్ గణపతిని దర్శించుకోవడం వల్ల నా చిన్ననాటి కల నెరవేరింది" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (వన్‌నేషన్): శ్రీ దయానంద వ్యాయామశాల గణేశ మండపం, శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం మాదన్నపేట హైదరాబాద్, 63వ సంవత్సరం పురస్కరించుకొని, విగ్రహ దాత శ్రీ రాచూరి మల్లేశం గారు మరియు వారి కుటుంబ సభ్యులచే, మొదటి రోజు ఆ గణనాధుడు విగ్రహ ప్రతిష్ఠాపన మరియు పూజ కార్యక్రమం నిర్వహించారు, అనంతరం శ్రీ వీరాంజనేయ స్వామి భజన మండలి వారిచే, అంగ రంగ వైభవముగా భజన కార్యక్రమం నిర్వహించారు



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (వన్‌నేషన్): వినాయక చవితి సందర్భంగా ఎర్రవెల్లి నివాసంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ గారు శోభమ్మ దంపతులు..మనుమడు కల్వకుంట్ల హిమాన్షు రావు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**